Digital, tmedia.net.in
# టీ-మీడియా
tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...
TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!
ఆదివారం - 02- ఆగస్టు - 2026
GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

Looking for Natural Granites....
Cell : 8790605011

Rajasthan Marble & Granites


Near A1 Steel, Beside New Vision College, NTR Bypass Road, KHAMMAM



# ఎయిర్ పోర్ట్ లాంచ్..

## –ప్రధాని మోదీ భావోద్వేగ ప్రసంగం!

**టి మీడియా, ఆగస్టు 1, భోగాపురం:** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఘనంగా జరిగింది. టెర్మినల్ ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పవిత్రమైన ఉత్తరాంధ్రకు రావడం తన అదృష్టం అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. భారత్మాతా కీ జై అంటూ ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోదీ, అందరికీ నమస్కారం అంటూ తెలుగులో అభివాదం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన మాసంలో.. ఈ పవిత్రమైన ఉత్తరాంధ్ర భూమికి రావడం ఎంతో గర్వంగా భావిస్తున్నాను, ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు ఇదో లాంచ్ ప్యాడ్ అని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి రన్వేగా, ఆంధ్రప్రదేశ్ యువత ఉజ్వల భవిష్యత్తుకు లాంచ్ప్యాడ్గా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై దూరదృష్టితో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి విజన్ను అభినందించారు.అల్లూరి సీతారామరాజు నడియాడిన గొప్ప నేలపై నేడు ఆయన పేరుతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించడం గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. స్వర్ణాంధ్ర అభివృద్ధి లక్ష్య సాధనలో ఈ రోజు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో విమాన, రహదారి అనుసంధానం మరింత



బలోపేతమై, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు కొత్త ఊతం లభిస్తుందని ప్రధాని మోదీ అన్నారు.గతంలో ఎయిర్ పోర్టులకు ఓ కుటుంబం పేర్లు మాత్రమే ఉండేవి, కానీ మేం వచ్చాక ఆ పద్ధతిని మార్చాం. అయోధ్యలో వాల్మీకి పేరుతో, పంజాబ్ లో సంత్ రవిదాస్ పేర్లతో ఎయిర్ పోర్టులను ఏర్పాటు చేశాం. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించాం. అల్లూరి సేవలు నిత్యం స్మరించుకునేలా ఆయన పేరు పెట్టాం అని తెలిపారు. దేశంలో 2014 కంటే ముందు 74 ఎయిర్ పోర్టులు మాత్రమే ఉండేవి.. కానీ ఇప్పుడు 166 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఇప్పుడు చిన్న చిన్న పట్టణాల నుంచి విమానయాన సేవలు అందుతున్నాయి. ఉడాన్ పథకం ద్వారా తొలిసారి విమానం ఎక్కే అవకాశం చాలా మందికి లభించింది. స్మోక్ ఎయిర్ పోర్టు మోడల్ కాశీ నుంచి అమృత్ సర్ వరకు విస్తరించింది. దీని వల్ల 25 దేశాలకు ఎయిర్ కనెక్టివిటీ సాధించారు అని ప్రధాని మోదీ వెల్లడించారు.



# యాంటీ పేపర్ లీక్ బిల్లు

## –రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం.

**టి మీడియా , ఆగస్టు 1, ఢిల్లీ బ్యూరో:** దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) అమెండ్మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం.

ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు.

కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్టంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

# కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా..?

## –కొలీజియం సిఫార్సులపై జస్టిస్ ఉజ్జల్ భుయాన్

**టి మీడియా, ఆగస్టు 1, ఢిల్లీ బ్యూరో :** న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం చేసే సిఫారసులకు



తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇంకా రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లీగల్ థింక్ టాంక్ 'విధి'కి చెందిన ఒఅశ్రైఐ ఇనిషియేటివ్ రూపొందించిన ఒక రిపోర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ అక్కడ జరిగిన ఒక చర్చలో కొలీజియం శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మూడు కొలీజియం తీర్మానాల్లో న్యాయమూర్తుల పదోన్నతులు, నియామకాలకు సంబంధించి కారణాల్ని వెల్లడించలేదని అన్నారు.

**రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేసే వారికే చోటు!**

కారణాలు చెప్పకుండా రహస్యంగా నియామకాలు చేపట్టడం 3లో..

# నిలకడగా గోదావరి

భద్రాచలం వద్ద కొనసాగుతున్న మూడవ ప్రమాద హెచ్చరిక 2లో



# నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

– ఆగస్టు 4 నుంచి ప్రవేశాల ప్రక్రియ 2లో

# వారంలో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ఫీల్డ్ హైవే షురూ!

## హైదరాబాద్ నుంచి విశాఖకు తగ్గనున్న 56 కిలోమీటర్ల దూరం

**టి మీడియా, ఆగస్టు 1, ఖమ్మం :** రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ ఖమ్మం నుంచి దేవరపల్లి మధ్య నిర్మించిన తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ఫీల్ హైవే (ఎన్హెచ్-365 బీజీ) మరో వారం రోజుల్లోనే పూర్తి స్థాయిగా అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి ఇది వరకే రోడ్లు, వంతెనల నిర్మాణం పూర్తయినప్పటికీ, ధ్వంసలాపురం సమీపంలోని రైల్వే ట్రా రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ల పనులు నెమ్మదించాయి. దీంతో కొంతకాలంగా వైరా నుంచి దేవరపల్లి వరకు టోల్బాజాలను తెరచి రవాణాకు అనుమతించారు. తాజాగా ఎడమ వైపు ఆర్వోబీ నిర్మాణం పూర్తవడంతో దాని మీదుగా రాకపోకలు కొనసాగించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఏఐ) అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**గ్రీన్ఫీల్ హైవే వివరాలివే...**

సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలు ఖమ్మం జిల్లాలోకి రాగానే తెల్దారుపల్లి దగ్గర ఉన్న టోల్గేట్ ద్వారా గ్రీన్ ఫీల్డ్ హైవేపైకి ప్రవేశిస్తాయి. చివరగా దేవరపల్లి సమీపంలో నిష్క్రమణ (ఎగ్జిట్) గేటు నుంచి దిగుతాయి.ఖమ్మం నుంచి దేవరపల్లి మధ్యలో ఉండే ప్రధాన పట్టణాల దగ్గర హైవే కింద మరో తొమ్మిది టోల్ ప్లాజాల నుంచి కూడా గ్రీన్ ఫీల్డ్ హైవేపైకి ఎంట్రీ, ఎగ్జిట్ కావచ్చు.ఈ గ్రీన్ ఫీల్డ్పై సాధారణ హైవేల మాదిరిగా టోల్ ట్యాక్స్ వసూలు చేయరు. వాహనం ప్రవేశం నుంచి నిష్క్రమణ వరకు ఉండే దూరాన్ని బట్టి మాత్రమే వసూలు చేస్తారు. ఉదాహరణకు ఓఆర్ఆర్ తరహాలో



ఉంటుంది.హైవే పొడవునా ప్రతి కిలోమీటరుకు ఒక సీసీ కెమెరాను అమర్చారు. వందనం, చౌడవరం సమీపంలో భారీ గూడ్స్ వాహనాలు నిలిపేలా ట్రక్ లే బైలు కూడా ఏర్పాటు చేశారు.ఈ హైవేకు అమరావతి నుంచి నాగ్పూర్ వెళ్లే మరో గ్రీన్ ఫీల్డ్ హైవే వందనం-కొదుమూరు దగ్గర అనుసంధానమవుతుంది. ఇక్కడ కూడా రెండు హైవేల రవాణాకు అంతరాయం కలగకుండా క్లోవల్ లీఫ్ రోడ్డు నిర్మించారు. దీని ద్వారా పరస్పరం ఒక హైవే నుంచి మరో హైవేకు సులభంగా మారొచ్చు.ఈ హైవేపై వాహనాన్ని బట్టి 80, 100 కిలోమీటర్ల స్పీడుతో ప్రయాణించొచ్చు.తగ్గనున్న 56 కిలోమీటర్ల దూరం : ఈ గ్రీన్ ఫీల్డ్ను ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పచ్చని పంట పొలాల మీదుగా తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకునేలా రూపొందించారు. దీని కోసం 162.04 కిలోమీటర్ల మేర 4 వరుసల రోడ్డును నిర్మించారు. ఇందులో ఖమ్మం జిల్లాలోనే 105 కిలోమీటర్లు కాగా, 3 ప్యాకేజీల్లో రూ.2,213.91 కోట్లతో నిర్మాణం చేపట్టారు. దీనివల్ల హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు 56 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది.

**లోడ్ టెస్టింగ్**

ఈ హైవేలో సంవత్సరం కిందటే అండర్ పాస్లు, రహదారులు పూర్తయ్యాయి. ఆర్వోబీల వల్ల దీని ప్రారంభానికి జాప్యం నెలకొంది. ఇటీవల ఎడమ వైపు ఉన్న ఆర్వోబీ నిర్మాణం పూర్తవడంతో వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకోవడానికి అధికారులు లోడ్ టెస్టింగ్ చేస్తున్నారు. ఇది పూర్తయితే మిగితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని చూస్తున్నారు. ఎన్హెచ్ఏఐ అధికారులు తొలుత ఆగస్టు 1నే హైవేపై రాకపోకలు ప్రారంభించాలని భావించారు. కానీ ఇంకా రెండు, మూడు రోజులు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది

# వట్పల్లి పోలీస్ స్టేషన్పై గ్రామస్తుల దాడి

## –అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ యువకుడు 2లో

T MEDIA (తెలుగు డిజిటల్)
MEDIA బ్రేకింగ్
క్లాసిఫైడ్స్ (ప్రకటనలు)
20 పదాలు, 4లైన్లు తో
కేవలం రూ 119/- లు మాత్రమే
అద్దె కు | అమ్మకం | ఉద్యోగ | ఉపాధి అవకాశాలు
తదితర ప్రకటనలు
నోట్: అన్ని రకాల ప్రకటనలకు జీ ఎస్ టీ బిల్లు ఇవ్వబడును.
సంప్రదించండి:
8919710365
7382990365
8500459365
ప్రకటన ఇవ్వండి విజయవంతం చేయండి
త్వరగా • సులభంగా • నమ్మకంగా




# వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌పై గ్రామస్తుల దాడి

## –అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ యువకుడు

సంగారెడ్డి జిల్లా వట్పల్లిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ యువకుడి విషయం పోలీస్ స్టేషన్ పై దాడికి దారితీసింది. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దరఖాస్తుపల్లి గ్రామస్తులు పోలీస్ స్టేషన్ను ముట్టడించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేష్ప రాళ్లు రువ్వి, లోపలికి దూసుకెళ్లి ఫర్నిచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడ అసలు ఏం జరిగింది? గ్రామస్తుల ఆగ్రహానికి కారణం ఏంటి? పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఈ గొడవకు అసలు కారణం వట్పల్లి పరిధిలోని ఓ దాబాలో పనిచేసే 22 ఏళ్ల బీరప్ప అనే యువకుడి అనుమానాస్పద మృతి.. అని స్థానికులు తెలిపారు.దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన బీరప్ప శనివారం ఉదయం దాబా వెనుక ఉన్న చెట్టుకు ఉరివేసుకుని శవమై కనిపించాడు. అయితే, మృతుడి కుటుంబ సభ్యులకు కానీ, గ్రామస్తులకు కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పోలీసులు మృతదేహాన్ని చెట్టుపై నుంచి కిందకు దించడమే వివాదానికి కారణమైంది. దీంతో వట్పల్లి పోలీస్ స్టేషన్ రణరంగంగా మారింది. ఆగ్రహంతో ఊగిపోయిన దరఖాస్తుపల్లి గ్రామస్తులు ఒక్కసారిగా పోలీస్ స్టేష్ప దాడికి దిగారు. స్టేషన్ లోపలికి చొరబడి కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్లు సహా ఫర్నిచర్ను బద్దలు కొట్టారు. కిటికీల అద్దాలను ధ్వంసం చేశారు. చూస్తుండగానే పరిస్థితి పూర్తిగా అదుపు తప్పడంతో వట్పల్లి పోలీస్ స్టేషన్ రణరంగంగా మారింది.పోలీసులు, దాబా యజమానులు కుమ్మక్కై.. ఆధారాలు తుడిచేసేందుకే తమకు చెప్పకుండా డెడ్ బాడీని కిందకు దించారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న దాబా వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న స్థానికులు.. అక్కడ నుంచి నేరుగా వట్పల్లి పోలీస్ స్టేషన్ వైపు తరలివచ్చారు. తమకు సమాధానం చెప్పాలంటూ పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. పోలీసుల నిర్లక్ష్య సమాధానాలతో ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో స్టేష్ప ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు.విషయం తెలియగానే వట్పల్లి పోలీస్ స్టేషన్ కి సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య చేరుకొని వివరాలను తెలుసుకున్నారు.. కాగా మృతుడికి బెట్టింగ్ ఆడే అలవాటు ఉందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు సమాచారం.. మరో వైపు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన వారి వివరాలను పోలీసులు రాబడుతున్నారు.. వారిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. కాగా, ఈ ఘటన సంచలనంగా మారింది.

# ప్రియుడి మర్మాంగాన్ని కోసిన వివాహిత..

**టి మీడియా , ఆగస్టు 1 , అనంతపురం** : ఏ తల్లి అయినా తన కూతురి జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తుందనే విషయానికి అనంతపురంలో జరిగిన ఈ ఘటన ఉదాహరణగా నిలిచింది. తనతో సహజీవనం చేస్తున్న వ్యక్తి.. తన కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించాడనే ఆగ్రహంతో ఓ మహిళ అతడి మర్మాంగాన్ని కోసిన ఘటన అనంతపురం నగరంలో చోటుచేసుకుంది. అనంతపురం నగరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన సునీత.. తాడిపత్రికి చెందిన సురేష్ అనే



వ్యక్తితో గత కొంతకాలంగా సహజీవనం చేస్తోంది. సురేష్ ఆటో డ్రైవర్గా పనిచేస్తున్నాడు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. సురేష్ మద్యం మత్తులో సునీత కుమార్తెపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహానికి గురైన సునీత, కత్తితో అతడి మర్మాంగాన్ని కోసింది. ఈ ఘటన సమయంలో సునీత కుమార్తె కూడా ఆమెకు సహకరించినట్లు సమాచారం. తీవ్ర రక్తస్రావానికి గురైన సురేష్ను స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం సునీత స్వయంగా వన్టౌన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఘటన అనంతరం సునీత స్వయంగా అనంతపురం వన్టౌన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు బాధితుడు, మహిళ, ఆమె కుమార్తె వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలు, దాడికి దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన అనంతపురం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మధిరలో ఇంజనీరింగ్ తరగతులకు అనుమతి

**టిమీడియా, ఆగస్టు 1 మధిర** : మధిరలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు జేఎన్టీయూ అనుమతి వచ్చింది. ఎంసెట్ రాసి వెబ్ ఆప్షన్లు పెట్టుకునే విద్యార్థులు మధిర కాలేజీని కూడా ఎంచుకునే అవకాశం కల్పించారు. ఇంజనీరింగ్ కాలేజీ కోసం మధిర పాలిటెక్నిక్ కాలేజీలోని కొంత భాగాన్ని కేటాయించటం జరిగింది. ఇందుకు సంబంధించి ముందుగా మూడు కోర్సులకు అనుమతి వచ్చింది. సిఎస్ సీ, ఎలక్ట్రానిక్స్, ఈసీ కోర్సులను ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్య ఇంజనీరింగ్ కాలేజీ వ్యవహారాలను కూడా ఇన్చార్జిగా చూస్తున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంజనీరింగ్ చేయాలనుకున్న విద్యార్థులు వెబ్ ఆప్షన్ లో మధిర ఇంజనీరింగ్ కాలేజీని ఎంచుకోవచ్చని మధిర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్య తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

## రూ.52,100 నగదు, బైకులు, ఫోన్లు స్వాధీనం.

**టీ మీడియా, ఆగస్టు 1, కొత్తగూడెం** : సర్వారం గ్రామపంచాయతీ పరిధిలోని గోప తండా శివారు, రైల్వే ట్రాక్ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై సీసీఎస్ సిబ్బంది మరియు సుజాతనగర్ పోలీసులు ఉమ్మడిగా దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడిలో ఆరుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు.వారి వద్ద నుంచి 52,100 నగదు, 2 ద్విచక్ర వాహనాలు, 5 స్మార్ట్ ఫోన్లు మరియు పేకముక్కలను స్వాధీనం (సీజ్) చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పట్టుబడిన నిందితుల వివరాలు:1.నునావత్ సంతోష్.2.భూక్య బిక్కులాల్.3.నున్నావత్ అశోక్ కుమార్.4.చల్ల రాజు.5.భూక్య వీరన్న.6.ఇస్లావత్ ప్రవీణ్ కుమార్.పరారీలో ఉన్న నిందితులు:1.కున్సోత్ వంశీ.2.భూక్య ప్రవీణ్.3.పల్లపు చంటి.4.బానోత్ గోపి.5.ధరావత్ రాజ్ కుమార్. చట్టవ్యతిరేకమైన పేకాట, జూదం లాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సుజాతనగర్ ఎస్సై రమాదేవి హెచ్చరించారు.



# నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

## – ఆగస్టు 4 నుంచి ప్రవేశాల ప్రక్రియ

**టి మీడియా, ఆగస్టు 1, ఢిల్లీ బ్యూరో:** వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన అఖిల భారత కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ షెడ్యూలును మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాన్ని కూడా పని రోజులుగా పరిగణించాలని అన్ని కళాశాలలకు ఎన్ఎంసీ సూచించింది.

**అర్హత సాధించిన 33,220 మంది అభ్యర్థులు**

నీట్ యూజీ– 2026లో అర్హత సాధించిన రాష్ట్రానికి చెందిన విద్యార్థుల జాబితాను డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం తాజాగా విడుదల చేసింది. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ జాబితాను కేంద్ర వైద్యసేవల డైరెక్టర్ జనరల్ అందించిన సమాచారం ఆధారంగా రూపొందించారు. ఈ జాబితాలో రాష్ట్రంలో అర్హత సాధించిన 33వేల 220 మంది అభ్యర్థుల నీట్ రోల్నంబర్స్, ఆలిండియా ర్యాంకు, నీట్ స్కోర్ పొందుపరిచారు. నీట్ యూజీ– 2026 పరీక్షల్లో రాష్ట్రంలో అర్హత సాధించిన 33,220 మందిలో అబ్బాయిలు 10,007 ఉంటే అమ్మాయిలు 23,213 మంది ఉన్నారు.

**కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు**

తాజాగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ వర్సిటీలకు ఆగస్టు 4 నుంచి 17వ తేదీ వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 22లోగా సంబంధిత కళాశాలల్లో చేరాలి. రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 28లోగా చేరాలి. ఇక రెండో విడతగా ఆల్ ఇండియా కోటాలో ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరుగుతుంది. ఎంపికైన అభ్యర్థులు సెప్టెంబర్ 8లోగా చేరాలి. రెండో విడతలో రాష్ట్ర కోటాలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కౌన్సిలింగ్ జరుగుతుంది. ఇందులో చేరేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 15గా నిర్ణయించారు.

**తరగతులు సెప్టెంబర్ 8 నుంచి**

మూడో విడతగా ఆల్ ఇండియా కోటాలో సెప్టెంబర్ 10 నుంచి 18 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందులో సీటు పొందినవారు



సెప్టెంబర్ 26లోగా చేరాలి. రాష్ట్ర కోటాలో సెప్టెంబర్ 16 నుంచి 26 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ రౌండ్లో చేరేందుకు చివరి తేదీ అక్టోబర్ ఒకటో తేదీగా నిర్ణయించారు. ఇక మిగిలిన ఖాళీ సీట్లకు స్ట్రే వేకెన్సీ రౌండ్ లో ఆల్ ఇండియా కోటాలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర కోటాకు సంబంధించి అక్టోబర్ 3 నుంచి 5వ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ రౌండ్లలో సీటు పొందినవారు అక్టోబర్ 10లోగా చేరాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఎన్ఎంసీ విడుదల చేసిన షెడ్యూలు ఆధారంగా కౌన్సెలింగ్కు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ వైద్య విద్య కోర్సుల తరగతులు ఈ ఏడాది సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభం కానున్నాయి.

# నిలకడగా గోదావరి

## భద్రాచలం వద్ద కొనసాగుతున్న మూడవ ప్రమాద హెచ్చరిక

**టీ మీడియా,ఆగస్టు1, భద్రాచలం:**

భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం గత నాలుగు గంటల నుండి నిలకడగా ఉన్నది. శనివారం ఉదయం 11 గంటలకు 56. 10 అడుగులు చేరుకొని మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతున్నది. గోదావరి నదికి మూడో ప్రమాద హెచ్చరిక శుక్రవారం రాత్రి జారీ చేసిన అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో అప్రమత్తమై సహాయ కార్యక్రమాలు ముమ్మరం చేశారు. భద్రాచలం వద్ద 56 అడుగులకు చేరుకోగానే భద్రాచలం నుండి దుమ్ముగూడెం చర్ల వెంకటాపురం వెళ్లే రహదారిపై వరద నీరు ప్రవేశించి ముంచేతడంతో దుమ్ముగూడెం చర్ల వెంకటాపురం వాజేడు ప్రాంతాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది.

భద్రాచలం సరిహద్దును గల ఆంధ్రలోని రాయినిపేట వద్ద గోదావరి బ్యాక్ వాటర్ రోడ్డును ముంచేతడంతో భద్రాచలం నుండి నెల్లిపాక మీదిగా చతిస్గడ్, ఒరిస్సా వెళ్లాల్సిన వాహనాలు సైతం ఆగిపోయాయి. విస్టా కాంప్లెక్స్ వద్ద గల మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల గోదారి బ్యాక్ వాటర్ భద్రాచలం పట్టణంలోకి ప్రవేశించడం వల్ల ఇస్తా కాంప్లెక్స్, అన్నదాన సత్రం వరద నీటిలో మునిగిపోయాయి.

కరకట్ట స్లూయిస్ లు లీక్ అవ్వడం వల్ల రెడ్డి సత్రం కొత్త కాలనీ సుభాష్ నగర్ ప్రాంతాలలో బ్యాక్ వాటర్ రావడంతో పలు గృహాలు వీటిలో మునిగిపోయాయి. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ అంకిత్ గోదావరి కరకట్ట పరిసర ప్రాంతాలను ముంపుకు గురి అయ్యే ప్రాంతాలను స్వయంగా పరిశీలించి సహాయ కాకర మాలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 15.96 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నది.

**తగ్గనున్న గోదావరి వరద**

గోదావరి ఎగువ ప్రాంతంలో గోదావరి ఉధృతి తగ్గుతున్నట్లు అధికారికంగా తెలిసింది. దీంతో శనివారం సాయంత్రం నుండి గోదావరి నీటిమట్టం గంట గంటకు తగ్గే అవకాశం ఉందని జలసంఘం అధికారులు పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పేరూరు వద్ద నీటిమట్టం 16. 870 మీటర్లలో ప్రవహిస్తూ ఉదయం 11 గంటల నుండి స్వల్పంగా తగ్గుతున్నది. దీంతో గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయానికి పెద్ద ఎత్తున తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

# విద్యుత్ షాక్‌తో మహిళా రైతు మృతి

## మోటారు ఆఫ్ చేసే క్రమంలో విషాదం..

**టి మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో విద్యుత్ షాక్కు గురై మహిళా రైతు మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన వడ్డే ఉమా (45) తన భర్త వడ్డే రమేష్తో కలిసి శనివారం ఉదయం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లారు.చేనుకు మందు పిచికారీ



పనులు పూర్తయిన అనంతరం రమేష్ భోజనం తీసుకురావడానికి ఇంటికి వెళ్లగా, ఉమా పొలం వద్దే ఉంది. భోజనం తీసుకుని తిరిగి పొలం వద్దకు వచ్చిన రమేష్కు భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. అనంతరం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా ఉమా బావిలో విగతజీవిగా కనిపించింది. ప్రాథమిక సమాచారం మేరకు, బావిలో నీరు నింపుతున్న విద్యుత్ మోటారును ఆపే ప్రయత్నంలో ఉమాకు విద్యుత్ షాక్ తగిలి, అనంతరం బావిలో పడిపోయి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ దృశ్యం చూసిన రమేష్ కన్నీరుమున్నీరుగా విలపించగా, స్థానికులు, బంధువులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త రమేష్తో పాటు ఇద్దరు కుమార్తెలు వెన్నెల, నిహారిక ఉన్నారు. సమాచారం అందుకున్న కారేపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు .వడ్డే ఉమా ఆకస్మిక మృతితో విశ్వనాథపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా ఖమ్మం

## –జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**టీ.మీడియా,జూన్1, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలోని చెరువులు, సరస్సులు, నదీ తీర ప్రాంతాలు సహా ప్రకృతి సిద్ధమైన నీటి వనరులను ప్రజలను ఆకర్షించే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్లో జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని చెరువులు, నీటి వనరుల వద్ద ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, అందుబాటు లో ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్కు వివరించారు.ఈ సందర్భంగా కలకోట, చింతకాని, ముత్తారం, చిరుమర్రి, బయ్యారం, మాటూరు లేక్, వైరా, పాలేరు రిజర్వాయర్, మధిర రివర్ ఫ్రంట్, ఇనియాద్రమ్మ, జమలాపురం, మామనూరు లేక్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ= జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం నీటి వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించా లని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అవసరమైతే అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన పర్యాటక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడబోమని పేర్కొన్నారు. మధిర రివర్ఫ్రంట్ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా, నాణ్యత తో చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించా లని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీఎఫ్వో అనూజ్ అగర్వాల్, టూరిజం ఎస్ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, టీజీటిడీసీ, సీపీఎస్పి ప్రతినిధులు ఎన్. రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, స్మిత, హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ సలావుద్దీన్, ఐ–క్యాడ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దాడిని ఖండిస్తూ ఆర్కెపి డివైసిఎంఓ కు వినతి పత్రం

**టీ మీడియా, ఆగస్టు 1, రామకృష్ణాపూర్** : కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో పారామెడికల్ సిబ్బంది పై జరిగిన దాడిని క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆర్కెపి డివైసిఎంఓ డాక్టర్ మధు కుమార్ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. అలాగే వారు మాట్లాడుతూ హాస్పిటల్ లో పనిచేస్తున్న సిబ్బంది భద్రతకు యాజమాన్యం భరోసా ఇవ్వాలని, ఈ సంఘటనపై యాజమాన్యం సమగ్ర సర్వే నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పలు గ్రామాల్లో పర్యటించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, ఆగస్టు 1 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ ఐ ఆర్ పారదర్శకత లో బాగంగా పలు గ్రామాల్లో పర్యటించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఓటు బలోపేత ప్రజాస్వామ్యం అని భాద్యతగా అర్హులైన ఓటర్లు విధిగా ఓటు నమోదు చేయించు కోవాలని పిలుపునిచ్చారుబి ఆర్ ఎస్ పార్టీ మాలపల్లి వై శాఖాపూర్ రాంపూర్ జనంపల్లి బి ఎల్ ఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ జాబితాసవరణనుఉద్యమస్ఫూర్తితోపాల్గొనిప్రజాస్వామ్య పాలనకు నాంది పలకాలని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గడువు ముగుస్తున్నందున బి ఎల్ ఓలు బి ఆర్ ఎస్ బి ఎల్ ఏలు బి ఆర్ ఎస్ శ్రేణులు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటర్ తుది జాబితాలో ఉండేవిధంగా కృషి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట మండల అధ్యక్షులు వనం రాములు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రేస్వామి ఎద్దుల సాయినాథ్ గోవిందు పాతపల్లి రాజశేఖర్ మధు వీరస్వామి గోనెల గణేష్ మూర్తి సాయిచారి వసంత్ గౌడ్ వై మర్యాద రవీందర్ రెడ్డి నాగిరెడ్డి కోట్ల బాల్ చంద్రా రెడ్డి మన్నెం నాయుడు సందీప్ రెడ్డి మోహన్ రెడ్డి శంకర్ రెడ్డి గోవిందు మహాదేవుడు జలివాల రాజు జలివాల విష్ణు గువ్వల వెంకటేష్ పరమేష్ రాంపూర్ నాయకులు బస్వారాజు శివరాజు హర్షవర్ధన్ రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మొగిలి గోకారయ్య రాజు మల్లికార్జున్ కొండల్ మన్యం మల్లేష్ రాజవర్ధన్ రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్స్ నోటిఫికేషన్ రావట్లేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

**టీ మీడియా, ఆగస్టు 1, ముదిగొండ:** గ్రూప్స్ నోటిఫికేషన్ రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలంలో కలకలం రేపింది. యువతకు ఉద్యోగాలు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాలయాపన చేస్తుండడంతో విసిగిపోయిన న్యూ లక్ష్మీపురంవాసి గడ్డం వేణు కుమార్ ఎలుకల మందు, ఇతర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతడు తాను ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో సూసైడ్ లేఖలో వెల్లడించాడు వేణుకుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ముత్తారం శివారులోని పల్లె చెరువులోని మిషన్ భగీరథ ప్లాంట్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేణు కుమార్ పీజీ వరకూ చదివాడు. గత అయిదేళ్లుగా గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ప్రతి రోజు ప్లాంటు వద్దకు వెళ్లి.. పని చూసుకుంటూ.. అక్కడే చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తాడు. రోజులానే శనివారం కూడా ఇంట్లో నుంచి వెళ్లాడు వేణు.

**ఐసీయూలో వేణు కుమార్ అయితే..**

సాయంత్రం సమయంలో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూప్లో సూసైట్ నోట్ పోస్ట్ చేసి అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రూపులో ఉన్నవారు అప్రమత్తమై వెంటనే అతడి తండ్రికి సమాచారం ఇవ్వగా.. వెళ్లి చూసేసరికి వేణు అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేణు ఆత్మహత్యకు ప్రయత్నించిన చోట ఎలకల మందు, గుర్తు తెలియని మాత్రలను





గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న వేణు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

**సూసైడ్ లేఖలో..**

గ్రూప్ నోటిఫికేషన్ ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై తను ఆత్మహత్యాయత్నం చేశానని సూసైడ్ లేఖలో వేణు కుమార్ వెల్లడించాడు. 'నా మరణానికి కారణం సరైన సమయానికి గ్రూప్స్ నోటిఫికేషన్లు రాకపోవడమే. గత 5 సంవత్సరాలుగా గ్రూప్స్కి ప్రిపేర్ అవుతున్నా. ఒక్కసారి మాత్రమే గ్రూప్స్ రాశా. ప్రతి సంవత్సరం జాబ్ కాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకూ ఇవ్వలేదు. జాన్ 2 సందర్భంగా చిన్న చిన్న నోటిఫికేషన్లు ఇస్తున్నారు, కానీ గ్రూప్స్ నోట్రిఫికేషన్ వచ్చే పరిస్థితి కనపడడం లేదు. 'జాబ్ కాలెండర్ ఇస్తాము' అని మానిఫెస్టోలో పెట్టటంతో నిరుద్యోగులమంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించాము. గత ప్రభుత్వంలో మిగిలిపోయిన నోటిఫికేషన్లు పూర్తి చేశారే తప్ప జాబ్ కాలెండర్ ఇవ్వలేదు. ప్రతి సంవత్సరం నోటిఫికేషను విడుదల చేస్తే నిరుద్యోగులుకు ఈ దుస్థితి వచ్చేది కాదు. ఏదో ఒక ఉద్యోగం వస్తుందని వారిమీద వారికి నమ్మకం ఉండేది. రెండు, మూడు సంవత్స రాలు వారి ప్రతిభను పరీక్షించుకుంటారు.5 సంవత్సరాలకి ఒకసారి పంచవర్ష ప్రణాళిక లాగా లేదా 10 సంవత్సరాలకి నోటిఫికేషన్స్ ఇస్తే ఎంతో మంది అభ్యర్థులు వారి విలువైన సమయాన్ని, వయస్సును పోగొట్టుకుంటున్నారు. అందులో నేను ఒకడిని. ఐదు సంవత్సరాలుగా గ్రూప్స్ అనే అనే ముసుగులో మునిగిపోయా. ప్రతి సంవత్సరం నోటిఫికేషన్లు వచ్చి ఉంటే నాక్కూడా ఏదో ఒక జాబ్ వచ్చేది. ఇప్పుడున్న పరిస్థితులలో అభ్యర్థులు వారి జీవిత కాలంలో 20 నుండి 30 సంవత్సరాల మధ్య ఒకటి లేదా రెండు నోటిఫికేషన్లు మాత్రమే చూస్తున్నారు. ఇటీవల విడుదలైన పోలీస్ నోటిఫికేషన్ కూడా నిరుద్యోగులని సంతృప్తి పరచలేదు. రాష్ట్రంలో, వ్యవస్థలో పై స్థాయిలో మార్పులు కనిపిస్తున్నా.. కింది స్థాయిలో వికేంద్రీకరణ జరగడం లేదు. మధిర నియోజకవర్గం ఎమ్మెల్యే, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి. మా అమ్మ మానసిక వికలాంగురాలు. మాకు సొంత ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు ఎప్పుడూ మంజూరు కాలేదు. 10 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటున్నాము. ఈ నోట్ సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్ గాంధీలకు చేరే వరకూ షేర్ చేయాలి' అని వేణు తన ఆవేదనను సూసైడ్ నోట్లో వెల్లగక్కాడు.

# ఆగస్టు 10 'జైల్ భరో'ను జయప్రదం చేయండి

## సీఐటీయూ మండల కన్వీనర్ కే.నరేంద్ర పిలుపు

**టీ మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే.నరేంద్ర పిలుపునిచ్చారు.సింగరేణి మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జనరల్ బాడీ సమావేశం యూనియన్ మండల కార్యదర్శి అనగా రాంబాబు అధ్యక్షతన శనివారం జరిగింది.ఈ సందర్భంగా కే.నరేంద్ర మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా ఉద్యమాలతోనే తిప్పికొట్టగలమని అన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు,రైతులు,వ్యవసాయ కార్మికులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు.కార్మికులకు నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి,గతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం బలహీనపరచడం దుర్మార్గమని విమర్శించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు.అలాగే రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వకుండా మోసం చేసిందని, వ్యవసాయ విద్యుత్తే మీటర్లు,రీఛార్జ్ విధానం తీసుకురావాలనే ప్రయత్నాలు రైతులపై అదనపు భారం మోపే చర్యలేనని అన్నారు.ఈ విధానాల వల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొంటూ,కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకురావడానికి ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కే.నరేంద్ర కోరారు.ఈ



సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు ముక్క సీతారాములు,బిల్డింగ్ వర్కర్స్ నాయకులు గజ్జల శ్రీనివాస్,ఆధర్ల ఉపేందర్, నారాయణ, వెంకటేశ్వర్లు, రమేష్, చిలుముల కిరణ్, హరియా, దండేపల్లి చంద్రారావుతో పాటు బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# బడి, గుడిని మింగేస్తున్న మద్యం మహమ్మారి!

## -విచ్చలవిడిగా బెల్ట్ షాపులు - విలపిస్తున్న గిరిజన కుటుంబాలు



**టీ మీడియా, ఆగస్టు 1, అశ్వారావుపేట** : 170 చట్టం (ఏజెన్సీ చట్టాలు) అమల్లో ఉన్న మన్యంలో మద్యం మహమ్మారి పడగ విప్పింది. పవిత్రమైన బడి, గుడి అనే తేడా లేకుండా మందు బాటిళ్లు యథేచ్ఛగా అమ్ముడవుతున్నాయి. అశ్వారావుపేట, పరిసర ప్రాంతాల్లో మద్యం మాఫియా చేస్తున్న అరాచకాలకు సామాన్యుల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అండదండలతో మద్యం వ్యాపారులు కోట్లు గడిస్తుంటే, నిరుపేద గిరిజనులు తమ ప్రాణాలను, కుటుంబాలను బలిపిస్తున్నారు.

**అడుగు దూరంలోనే మద్యం దుకాణాలు**

అనుమతులు ఉన్న వైన్ షాపులు కూడా పాఠశాలలు, ఆలయాలకు మూడు మీటర్ దూరంలోనే ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం బడి, గుడికి దూరంగా ఉండాల్సిన షాపులు, ప్రార్థనా మందిరాల పక్కనే వెలిశాయి. మద్యం సేవించిన మందుబాబులు రోడ్లపైకి వచ్చి విచ్చలవిడిగా అరుచుకోవడం, ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ కొట్టుకోవడం నిత్యకృత్యమైంది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది.

**బెల్ట్ షాపుల్లో దోపిడీ.. రూ. 50 నుండి 60 అదనం!**

ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల రాజ్యాంగం నడుస్తోంది. కూలీ పనులకు వెళ్తే రోజంతా కష్టపడితే వచ్చేది రూ. 400 నుండి రూ. 500 మాత్రమే. కానీ, ఆ కష్టాన్ని మద్యం మాఫియా నిలువునా దోచేస్తోంది.

వైన్ షాపుల్లో ఎంఆర్పి కంటే రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నారు.పట్టణ బెల్ట్ షాపుల్లో: బాట్కి రూ. 40 వరకు నొక్కేస్తున్నారులోపలి గిరిజన గ్రామాల్లో రూ. 50 నుండి రూ. 60 వరకు అదనంగా దండుకుంటున్నారు.ఈ లెక్కన ఒక్కో బాటిల్ అసలు ధరకంటే రూ. 350 నుండి రూ. 400 పైనే అదనంగా దోచేస్తున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులన్నీ మందుకే తగలేస్తుండటంతో సామాన్యుడి ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితి నెలకొంది.

**ఒంటరి మహిళల మయం!**

మద్యం మహమ్మారి గిరిజన యువతను, శ్రామికులను బలితీసుకుంటోంది. మద్యం సేవించి వాహనాలు అతివేగంగా నడపడం వల్ల చిన్న వయసులోనే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.మా ఊళ్లలో ఇప్పుడు పురుషుల కంటే



ఒంటరి మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. దానికి ఒక్కటే కారణం.. ఈ రాకాసి మద్యం! భర్తలు మద్యానికి బానిసై చిన్న వయసులోనే చనిపోతుండటంతో మహిళలు, పిల్లలు అనాథలుగా మారుతున్నారు. మా బతుకుతెరువు ఎలాగని ప్రశ్నిస్తున్నాం.

**పట్టించుకోని ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు**

నా ఇష్టం.. నా మద్యం అన్నట్లుగా అశ్వారావుపేటల్లో మద్యం వ్యాపారం జోరుగా సాగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాఫియా చేతుల్లో ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పవిత్రమైన ఏజెన్సీ ప్రాంతంలో బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైన్ షాపులను తొలగించి తమ కుటుంబాలను కాపాడాలని స్థానిక మహిళలు, గిరిజనులు వేడుకుంటున్నారు.

# నకిలీ బంగారం దందా అరికట్టేది ఎవరు?

### కారేపల్లి కేంద్రంగా ముఠా సామ్రాజ్యం?
### ఇద్దరే అరెస్టా... అసలు సూత్రధారులు ఇంకా అందనంత దూరంలోనా?
### దందా వెనుక ఉన్న పెద్ద తలలు ఎప్పుడు బయటపడతాయి?

**టీ మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో నకిలీ బంగారం ముఠాల వ్యవహారం రోజురోజుకూ విస్తరిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వరుసగా కారేపల్లి,కొరివి,హైదరాబాద్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవుతున్నా మోసాలు మాత్రం ఆగకపోవడం పోలీసుల దర్యాప్తుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**ఈకారేపల్లి నుంచే ముఠా కార్యకలాపాలా?**

ముఖ్యంగా కారేపల్లి కేంద్రంగా ఒకే ముఠా పలు ప్రాంతాల్లో తమ వల విసిరి అమాయక ప్రజలు,బంగారం కొనుగోలు సంస్థలు,ఫైనాన్స్ కంపెనీలు,వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తక్కువ ధర పేరుతో భారీ మోసం**

తక్కువ ధరకు బంగారం ఇస్తామని,అత్యవసరంగా డబ్బు కావాలంటూ నమ్మించి రాగి,ఇతర లోహాలతో తయారు చేసిన నకిలీ ఆభరణాలను అసలైన బంగారంగా చూపించి భారీగా నగదు కాజేస్తున్నట్లు సమాచారం.దీంతో పలువురు అమాయకులు లక్షలు,కోట్ల రూపాయలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

**అరెస్టులు జరిగాయి... కానీ అసలు నిందితులు ఎవరు?**

ఇటీవల వెలుగులోకి వచ్చిన కేసుల్లో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినప్పటికీ,ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు?వారికి అండగా నిలుస్తున్నవారు ఎవరూ?నకిలీ బంగారం ఎక్కడ తయారవుతోంది?ఈ ముఠా నెట్వర్క్ ఎంత విస్తరించింది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు.

**కిందిస్థాయి వారితోనే కేసు ముగిస్తే సరిపోతుందా?**

కేవలం కిందిస్థాయి వ్యక్తులను పట్టుకుని కేసు ముగిస్తే సరిపోదు.ఈ దందాకు రూపకల్పన చేసిన అసలు సూత్రధారులను,ఆర్థికంగా అండగా నిలిచిన వారిని,మోసాలకు మార్గదర్శకులైన పెద్ద తలలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థలపై ఉంది.లేదంటే నేడు ఇద్దరు,రేపు మరో ఇద్దరు అంటూ నాటకం కొనసాగి అమాయకులే బలవుతుంటారు.

**మూలాలతో సహా పెకిలించాలి**

నకిలీ బంగారం ముఠాను మూలాలతో సహా పెకిలించి,ఈ దందా వెనుక ఉన్న అసలు మాస్టర్మైండ్లను బయటపెట్టి కఠిన చర్యలు




తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ ముఠాకు ఆశ్రయం,సహకారం అందిస్తున్న వారిపైనా ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

**పోలీసుల హెచ్చరిక**

బంగారం కొనుగోలు,తాకట్టు లావాదేవీల్లో పూర్తి ధ్రువీకరణ లేకుండా ఎలాంటి నగదు చెల్లింపులు చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు.అనుమానాస్పదంగా ఎవరైనా బంగారం విక్రయించేందుకు వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

వల్ల అనర్హులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు. గతంలో ఒక హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒక వర్గం ప్రజల్ని ఉద్దేశించి 'చీమలు' అన్నారని, మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదంతాల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

**'ఎవరిని ఎందుకు సిఫార్సు చేస్తున్నామో తెలియాలి'**

కారణాలు దాచడం ద్వారా కొలీజియం అద్భుతంగా పనిచేసే నిజాయతీ గల జడ్జిలకు ద్రోహం చేయడమే కాకుండా, న్యాయ వ్యవస్థలోకి అనుచిత వ్యక్తులు వచ్చేందుకు స్థానం కల్పిస్తోంది. అటువంటి వారు రేపటి రోజున వ్యవస్థలోకి వచ్చి ఒక వర్గం ప్రజల్ని చీమలు అని సంబోధిస్తూ రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంది' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఉదహరించారు. న్యాయవ్యవస్థలోకి అలాంటి వ్యక్తులు రాకుండా అడ్డుకోవాలంటే, ఎవరిని ఎందుకు ఎంపిక చేస్తున్నామో, ఎందుకు తిరస్కరిస్తున్నామో తెలిపేలా సరైన చర్చలు జరగాలని, కారణాల్ని కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కనీసం సిఫార్సులకు కారణాలైనా వెల్లడించేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయం అసలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

ఇక్కడ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. అయితే 2024లో విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో పాల్గొన్న అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. అప్పుడు ఆ జడ్జి 'మన సంస్కృతిలో చిన్న చిన్న జంతువులకు కూడా హాని చేయకూడదని, చీమలను కూడా చంపకూడదని నేర్పుతారు. ఇది మనలో బలంగా నాటుకుపోయింది. కానీ మీ సంస్కృతిలో చిన్నప్పటి నుంచే జంతువుల వధను చూస్తారు. మీలో సహనం, కరుణ ఎలా ఆశించగలం' అంటూ వ్యాఖ్యానించగా, దీనిపై అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

**వివాదాలకు దారితీస్తున్న వ్యాఖ్యలు**

మరోవైపు ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కూడా ఒక సందర్భంలో కొందరిని 'కాక్రోచ్ (బొద్దింకలు)' అని వర్ణించడం వివాదాస్పదమైంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతోూఉఉఖీ (నీట్ పరీక్ష) పేపర్ లీక్ అంశంపై పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన ఉద్యమం కూడా చెలరేగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా కూడా చేశారు.అయితే కొలీజియం వ్యవస్థలపై వచ్చే విమర్శలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గతంలో స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సుప్రీం కోర్టుకు లేదా హైకోర్టులకు న్యాయమూర్తుల్ని సిఫార్సు చేసే సమయంలో వారి పనితీరు, న్యాయమూర్తిగా అందించిన సుదీర్ఘ సేవలు, గతంలో వారు నిర్వహించిన బాధ్యతల్ని, వృత్తిపరమైన అనుభవం వంటి అనేక అంశాల్ని పరిశీలించిన తర్వాతే కొలీజియం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు.

# స్కూల్ లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎలక్షన్స్

**టిమీడియా, ఆగస్టు 1,కురవి:** కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం స్కూల్ హెడ్ బాయ్,హెడ్ గర్ల్ ఎన్నుకొనుటకై ఎలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎలక్షన్స్ ఏ విధంగా జరుగుతాయి విద్యార్థులు పిల్లలు దగ్గరికి వెళ్లి వారి సమస్యలు చదువులో సమస్యలను తెలుసుకుని సాల్వ్ చేస్తామని, భరోసా కల్పిస్తూ ఎలక్షన్స్ లో ముందుకు సాగడం జరిగింది నిజమైన ఎన్నికలు ఎలా జరుగుతాయో అదే మాదిరిగా విద్యార్థులందరి



దగ్గరికి వెళ్లి, వారిని కలిసి ఓటు వేయమని, అభ్యర్థించారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పురం భూపాల్ రెడ్డి,డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్,వైస్ ప్రిన్సిపల్ ప్రీతీ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ... సమాజంలో ఏ విధంగానైతే ఎలక్షన్లు జరుగుతాయో అదే మాదిరిగా మన స్కూల్లో కూడా ఎన్నికలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు ఎలక్షన్స్ ఎలా జరుగుతాయో చక్కగా ఈ ఎన్నికల ద్వారా తెలియజేయడం జరిగింది అంతేకాకుండా ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత పనులు చేయకుంటే వారితో రాజీనామా కూడా చేపిస్తామని ప్రతిజ్ఞ చేయించడం కూడా జరిగింది.. ఇలాంటివి కార్యక్రమాలు స్కూల్లో నిర్వహించడం వల్ల విద్యార్థులకు కూడా చక్కగా వాటి యొక్క అనుభవాలు నిత్యజీవితము లో ఎంతగానో దోహద పడుతాయి అని కొనియాడారు.ఇలాంటి పిల్లలకు ఉపయోగ పడే కార్యక్రమం లు చాలా నిర్వహించడం జరుగు తున్నాయి అని తెలియ జేశారు ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లి పాల వారోత్సవాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్

**టీ మీడియా, ఆగస్టు 01 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని అంగన్వాడి 7 వ సెంటర్ లో తల్లి పాల వారోత్సవాల్లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ సుమిత్రా ఎల్లారెడ్డి మట్లాడుతూ తల్లులు కానుపు తర్వాత వచ్చే ముర్రు పాలు పిల్లలకు చాలా ముఖ్యమని పిల్లలకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందనీ అన్నారు ఈ ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ స్వర్ణ లత ఆశా వర్కర్ జ్యోతి పిల్లల తల్లులు పాల్గొన్నారు




# ద్విచక్ర వాహనాలు ఢీ

## -ఒకరికి తీవ్ర గాయాలు

**టి మిడియా, ఆగస్టు 1, ఆళ్లపల్లి:** ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని, రాయిపాడు మార్గంలోని కిన్నెరసాని వంతెన వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. టేకులపల్లి మండలం కోయగూడెంకు చెందిన ఎ. కార్తీక్ ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. ఢీ అనంతరం ఆయన స్పృహ కోల్పోయారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సమాచారం అందించారు. సమాచారం



అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి, ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# జలదిగ్బంధంలో 40 గ్రామాలు

## -స్తంభించిపోయిన రాకపోకలు.

**టీ.మీడియా,జూన్1,చింతూరు**: చింతూరు మండలం లో గత నాలుగు రోజులు గా కురుస్తున్న వర్షాలకు శబరి, గోదావరి, పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో సొకిలేరు, కుయగూరు వాగు ఎగపోటు గురవడం తో చింతూరు మండలానికి, విఆర్ పురం మండలానికి రాకపోకలు స్తంభించాయి. చింతూరు మండలం లోని కల్లేరు, ముకునూర్, పెదసీతన పల్లి, ఎ జి కోడేరు, వెంకన్నగూడెం,రామవరం, చింతరేవు పల్లి తదితర పంచాయతీ ల లోని సుమారు 40 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.ఎగపోటుకు గురవడం తో జమాయిల్ తోటలు ముంపుకు







గురయ్యాయి.ఇది ఇలా ఉండగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చింతూరు విఆర్ పురం కూనవరం మండలాల్లో విస్తృతంగా పర్యటించి ముంపుకు గురైన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం, నిత్యావసర వస్తువుల సౌకర్యాలను కలగజేయాలని యూనిట్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.ఫ్లడ్ డ్యూటీ లో వున్న అధికారులు వరద పరిస్థితి ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు.

# నాగర్కర్నూల్లో న్యాయవాది దారుణ హత్య

**టి మీడియా, ఆగస్టు 1, నాగర్కర్నూల్ :** నాగర్కర్నూల్ జిల్లాలో ఓ న్యాయవాది అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. పెంట్లవెల్లికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు, న్యాయవాది మల్లయ్య (55)పై దుండగులు పథకం ప్రకారం దాడి చేసి వేటకొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పెంట్లవెల్లిలో క్లినిక్ నిర్వహిస్తూ ఆర్ఎంపి వైద్యుడిగా, న్యాయవాదిగా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన క్లినిక్లో ఉండగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఆరోగ్య సమస్య ఉందని చెప్పి అక్కడికి వచ్చారు. వారిని పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా మల్లయ్య కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆయనను క్లినిక్ నుంచి బయటకు ప్రధాన రహదారిపైకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. తీవ్ర గాయాలతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్లయ్య హత్య వెనుక భూ వివాదాలే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సైబర్ మోసాలకు బలి కావద్దు : ఎస్ఐ జయన్న

**ఈ మీడియా , ఆగస్టు 1, ఆత్మకూరు** : వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలో ఎస్ఐ జయన్న ప్రజలకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. గద్వాల-ఆత్మకూర్ వంతెన నిర్మాణ ప్రాంతంలో ప్రస్తుతం



నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఆ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చేపలు పట్టేందుకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు వస్తాయని, బహుమతులు గెలిచారని లేదా ఓటీపీ (ఓటిపి) చెప్పాలని కోరినా ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచించారు. ఎవరూ ఫోన్ ద్వారా బ్యాంకు వివరాలు లేదా ఓటీపీ అడగరని, అలాంటి కాల్స్ను నమ్మవద్దని రైతులతో పాటు ప్రజలకు వివరించారు.ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్లో మాట్లాడడం వల్ల దృష్టి మరలిపోయి వేగ నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జయన్న సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మోహన్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల 2వ రోజు పెన్డౌన్

**టీ మీడియా ,ఆగస్టు 1, కూసుమంచి:** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే తమకు పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీబీ-జీ రామ్ -జీ ఉద్యోగులు, సిబ్బంది 3వ, రోజు శనివారం కూసుమంచి లో పెన్డౌన్ నిర్వహించారు. తమ విధులను బహిష్కరించి కార్యాలయం బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏ పి



ఓ అప్పారావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని, నాన్ యఫ్ టి ఇ ఉద్యోగులను యఫ్ టి ఇ లుగా గుర్తించాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లింపులు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఉద్యోగులు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉద్యోగ భద్రతతో పాటు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. ప్రతి నెలా నిర్దిష్ట తేదీన జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు పరిష్కరించబడే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల ఐక్యతతో ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏ పి ఓ అప్పారావు తో పాటు టి ఎ లు శ్రీనివాస్, రవికాంత్, భవాని, నరేష్, హరినాయక్, కంప్యూటర్ ఆపరేటర్లు నరసింహారావు, తులసి పాల్గొన్నారు.